క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



బుచ్చిరెడ్డిపాళెం: జిల్లా గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు సంఘంగా ఏర్పాటై నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్ రాజును నూతన కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కమిటీ సభ్యులను డీఏఓ అభినందించారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బ్రహ్మేంద్ర, మహేష్, సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు అవాస్తవం



మనుబోలు: మండల కేంద్రమైన మనుబోలులో మంగళవారం టీడీపీ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా చేరెడ్డి కోదండ రామిరెడ్డి ఆధ్వర్యంలో 50 కుటుంబాలు ఆ పార్టీలో చేరినట్లు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పడం అవాస్తవమని వైఎస్సార్‌సీపీ నాయకుడు అనమాల ప్రభాకర్‌రెడ్డి ఖండించారు. బుధవారం ఆయన మనుబోలులో విలేకరులతో మాట్లాడారు. సోమిరెడ్డి కండువాలు కప్పిన వారంతో గతంలో టీడీపీలోనే ఉన్నారని తెలిపారు. కొత్తగా టీడీపీలో చేరినట్లు చెబుతున్న వారి పేర్లను ప్రకటిస్తే గతంలో వారు ఆ పార్టీలోనే ఉన్నారని నిరూపించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు.

నేత్రపర్వంగా పుష్పయాగం



నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. స్వామి, ఆదిలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పుష్పయాగం, ఏకాంతసేవను రాత్రి నిర్వహించారు. ఉభయకర్తలుగా మురళీకృష్ణ, కమల దంపతులు, విశ్వనాథ్‌రావు కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ధనలక్ష్మీపురంలో చోరీ

నెల్లూరు రూరల్: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన ధనలక్ష్మీపురంలో చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. ధనలక్ష్మీపురంలోని సరస్వతీనగర్‌లో బిహార్‌కు చెందిన రంజిత్ కుటుంబం నివసిస్తోంది. జిందాల్ కంపెనీలో ఏజీఎంగా విధులు నిర్వర్తిస్తున్నారు. పిల్లలకు సెలవులివ్వడంతో బిహార్‌కు గత నెల 30న కుటుంబంతో కలిసి వెళ్లారు. ఈ క్రమంలో దుండగులు ఇంటి తాళాలను పగలగొట్టి లోపలికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. ఇంటికి బుధవారం వచ్చిన ఆయన చోరీ విషయాన్ని నిర్ధారించుకున్నారు. ఆరు సవర్ల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులను నవాబుపేట పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. యనమలవారిపాళేనికి చెందిన రౌడీషీటర్ తేజపై తడికలబజార్ ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ గుణ, మణికంఠ, హరి హత్యాయత్నానికి సోమవారం పాల్పడ్డారు. ఘటనపై కేసు నమోదు చేసిన నవాబుపేట పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో మణికంఠ, హరిని అరెస్ట్ చేశామని ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు తెలిపారు.

వీనులవిందుగా గాత్రకచేరి



నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని త్యాగరాజస్వామి మందిర 40వ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. మందిరంలో విశేష పూజలను భిక్షాటన పూర్వక త్యాగరాజ స్మరణోత్సవ సభ, మందిర నిర్వాహక కమిటీ కార్యదర్శి నాగదేవీప్రసాద్ ఆధ్వర్యంలో జరిపారు. విద్వాంసులు, సంగీత కళాకారులతో త్యాగరాజ పంచరత్న గోష్ఠి గానాన్ని నిర్వహించారు. అనంతరం మలేసియాకు చెందిన లక్ష్మీశేఖర్ వీణ కచేరి వీనుల విందుగా సాగింది. చెన్నైకి చెందిన గాయకుడు సాయివిఘ్నేష్‌తో ప్రధాన గాత్ర కచేరిని జరిపారు.

బీడు బారిన భూములు సస్యశ్యామలం

- మెట్టప్రాంత రైతుల కళ్లల్లో ఆనందం
- నాలుగేళ్ల పాలనలో వేలాది ఎకరాల్లో పంటలు
- ఎడగారు సాగుకు రైతుల సన్నద్ధం



కండలేరు ఏటి కాలువలో ప్రవహిస్తున్న నీరు

పొదలకూరు: గతంలో వర్షాలు పడక, సాగునీరందక భూములను బీడు పెట్టుకున్న అన్నదాతల కళ్లల్లో ఇప్పుడు ఆనందం కనిపిస్తోంది. రబీలో మెట్ట ప్రాంత భూములు సస్యశ్యామలం అయ్యాయి. పంట కాలువల ద్వారా పుష్కలంగా సాగునీరు అందడంతో రైతులు పంటలు పండించుకున్నారు. గతంలో వర్షాలు సమృద్ధిగా కురవక, సోమశిల, కండలేరులో నీటినిల్వలు లేక డెల్టా రైతుల సాగునీటి అవసరాలకే నీటిని విడుదల చేసేవారు. గత నాలుగేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఆ పరిస్థితులు మారాయి. పుష్కలంగా వర్షాలు కురుస్తుండడం..పంట కాలువల ద్వారా చివరి ఆయకట్టుకు సాగునీరు విడుదల చేస్తుండడంతో బీడు వారిన పొలాలు పచ్చదనం పరచుకున్నాయి. ఈ ఏడాది మెట్ట ప్రాంతంలోని కాలువల అన్నింటికి జలవనరులశాఖ అధికారులు నీటిని విడుదల చేశారు. కండలేరు ఎడమగట్టు కాలువ ద్వారా వేలాది ఎకరాలకు సాగునీటిని అందించారు. కండలేరులో పుష్కలంగా నీటినిల్వలు ఉండడంతో పాటు సోమశిల వరద కాలువ ద్వారా కండలేరుకు నీరు వచ్చి చేరడంతో ఎత్తిపోతలతో పనిలేకుండా హైలెవల్ స్లూయిజ్ ద్వారానే సాగునీటిని రైతులు వాడుకున్నారు. వేసవిలోనూ రైతులు, పాడిరైతుల అవసరాల మేరకు కాలువలకు సాగునీటిని విడుదల చేస్తున్నారు. దీంతో వేసవిలో పశువుల తాగునీటి అవసరాలు తీరడంతో పాటు బోర్లలో భూగర్భజలాలు పెరిగాయి.

ఎడగారు సాగుకు సన్నద్ధం

మండలంలోని రైతులు ఎడగారు సాగుకు సన్నద్ధం అవుతున్నారు. గత రబీలో కాలువలకు పుష్కలంగా సాగునీరు విడుదల చేయడంతో భూగర్భజలాలు గణనీయంగా పెరిగాయి. ఫలితంగా వ్యవసాయ బోర్లలో నీటి మట్టం పెరిగింది. దీంతో డెల్టా పల్లెలతో పాటు నాన్ డెల్టా పల్లెల్లోని రైతులు ఎడగారు సాగుకు సమాయత్తం అవుతున్నారు. డెల్టా పరిధిలోని సూరాయపాళెం, విరువూరు, మహ్మదాపురం, తాటిపర్తి, నేదురుమల్లి, వెలికంటిపాళెం, నల్లపాళెం తో పాటు నాన్‌పెన్నార్ పల్లెలైన డేగపూడి, రాజుపాళెం, తదితర గ్రామాల్లో సుమారు 1,500 ఎకరాల్లో ఎడగారు సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న గొల్లపల్లి విజయ్‌కుమార్

కోవూరు: పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. కోవూరులోని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఏడో కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థను అభివృద్ధి పథంలో నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా 30 మేలు జాతి కోడె దూడలకు గానూ ఇప్పటి వరకు 14 ఒంగోలు, 2 ముర్రా జాతి కోడె దూడలను జిల్లాకు పంపిణీ చేసినట్లు తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 14 దూడలకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. పెయ్యి దూడల ఉత్పత్తి పథకం కింద ఇప్పటి వరకు 3,480 వీర్య నాళికలను సరఫరా చేశామన్నారు. రాబోయే ఏడాది ఆ సంఖ్యను ఏడు వేలకు పెంచేలా చూస్తామన్నారు. నెల్లూరులో పాటు తిరుపతి జిల్లాలోనూ పెయ్యి దూడల ఉత్పత్తి పథకం అమలుకు కృషి చేస్తున్నామన్నారు. పశుసంవర్ధకశాఖ జేడీ మహేశ్వరుడు, ఈఓ సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

జొన్నవాడ బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



కలెక్టర్‌ను ఆహ్వానిస్తున్న చైర్మన్, ఈఓ

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు రావాలని పలువురు ప్రముఖులను ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు బుధవారం ఆహ్వానించారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి, తదితరులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు.

కోదండరామస్వామి ఆలయాభివృద్ధికి నగదు విరాళం



నగదు విరాళాన్ని అందజేస్తున్న వైస్‌ఎంపీపీ నారసింహారెడ్డి

కోవూరు: స్థానిక కోదండరామస్వామి ఆలయాభివృద్ధి పనులకు వైస్‌ఎంపీపీ శివుని నారసింహారెడ్డి రూ.1.50 లక్షలు విరాళాన్ని అందజేశారు. బుధవారం ఆయన డీఏబీ చైర్మన్ డీ నిరంజన్‌బాబురెడ్డి, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డితో కలిసి ఆలయాభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం అభివృద్ధి పనులు, గాలి గోపురం రంగులకు రూ.1.50లక్షల విరాళాన్ని ఆలయ చైర్మన్ కాటంరెడ్డి కృష్ణారెడ్డికి అందజేశారు. వారి వెంట మండల సచివాలయ కన్వీనర్ ప్రసాద్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

15లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ముత్తుకూరు: విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు ఈ నెల 15లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎంఈఓ మధుసూదన్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. గ్రామ సచివాలయా ల్లో ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తారని తెలిపా రు. అర్హులైన పేద విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపట్నుంచి శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహోత్సవాలు ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పెంద్యాల రమణయ్యనాయుడు, వాకాటి శ్రీనివాసులు రెడ్డి బుధవారం వెల్లడించారు. 12న అంకురార్పణ, 13న ధ్వజారోహణం, సాయంత్రం శేషవాహనసేవ, 14న సూర్యప్రభ వాహనసేవ, సాయంత్రం హనుమంత వాహనసేవ, 15న ఉదయం కల్యాణోత్సవం, గజ వాహన సేవ, సాయంత్రం గరుడ వాహనసేవ, 16న ఉదయం కల్పవృక్షవాహన సేవ, సాయంత్రం అశ్వ వాహన సేవ 17న చక్రతీర్థం సాయంత్రం పుష్పయాగం, 18న ఉదయం 108 కలశాలతో అభిషేకం నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రతిరోజూ సాంస్కృతిక, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి,అమ్మవార్లను దర్శించుకుని కృపకుపాత్రులు కావాలని కోరారు.

భానుడి భగభగలు

పొదలకూరు: భానుడు భగభగలాడుతున్నాడు. ఉదయం 10 గంటల నుంచే తన ప్రతాపం చూపుతున్నాడు. దీంతో వేసవి తాపంతో మండల ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇటీవల పొదలకూరు పక్క మండలాలైనా రాపూరు, కలువాయిలో ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. పొదలకూరులో చినుకు పడకపోవడంతో ఎండల వేడి తగ్గడం లేదు. గత వారం రోజులుగా 41 నుంచి 43 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీనికి తోడు ఉక్కపోతతో వృద్ధులు, పిల్లలు అల్లాడిపో తున్నారు. భానుడి ప్రతాపంతో ఉదయం 10 గంటలకే పట్టణంలోని వీధులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. 11 గంటల తరువాత ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావడం లేదు.

ముగిసిన ఉపాధ్యాయ శిక్షణ తరగతులు

వెంకటాచలం: గొలగమూడిలోని భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో గత మూడ్రోజులుగా జరుగుతున్న గణిత ఉపాధ్యాయ శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు జలదంకి ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు ఎం రమేష్ ముగింపు ఉపన్యాసం ఇచ్చారు. శిక్షణకు హాజరైన గణిత ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఈ నెల 15 నుంచి 19 తేదీ వరకు జిల్లాల స్థాయిలో జరిగే శిక్షణ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటారు బైక్ అదుపుతప్పడంతో వ్యక్తి గాయపడిన ఘటన కందలపాడు క్రాస్‌రోడ్డు వద్ద బుధవారం ఉదయం చోటుచేసుకుంది. నెల్లూరులోని మనుమసిద్దినగర్‌కు చెందిన ఫయాజ్ మోటార్‌సైకిల్‌పై కసుమూరుకు వెళుతుండగా మార్గం మధ్యలో కందలపాడు క్రాస్‌రోడ్డు వద్ద మోటారుబైక్ అదుపుతప్పడంతో గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా సర్వజన వైద్యశాలకు తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ధ్యానంతో ఏకాగ్రత



ధ్యానం సాధన చేస్తున్న చిన్నారులు



ల్యాప్ టాప్‌లో నీతి కథలు వీక్షిస్తున్న విద్యార్థులు

మనుబోలు: ధ్యానంతో ఏకాగ్రత పెరుగుతుందని, తద్వారా విద్యార్థులు చదువుపై మనస్సును లగ్నం చేసేందుకు వీలవుతుందని యోగా శిక్షకుడు చెలికం కోటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యానికి, మానసికోల్లాసానికి ధ్యానం, యోగా సాధన ఎంతో ఉపకరిస్తాయన్నారు. గ్రంథాలయాధికారి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు చెడుఅలవాట్లకు లోనవకుండా వేసవి విజ్ఞాన శిబిరం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులకు ఆట విడుపుగా పుస్తకాలు చదవడం, చదివిన కథలను విశ్లేషించడం, కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లీష్, చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్స్, తదితరాలు చేయిస్తామని తెలిపారు.

కొడవలూరు: వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కొడవలూరు గ్రంథాలయాధికారి కే రాజేశ్వరి కోరారు. కొడవలూరు గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లో నీతి కథలు చూపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో చిన్నారులు ఎండకు తిరగకుండా గ్రంథాలయాలకు రావడం వల్ల విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. తొలుత విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

చివరి దశకు చేరిన విష్ణాలయ నిర్మాణం



ముత్తుకూరు: మండలంలోని కృష్ణపట్నంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన శ్రీవేణుగోపాలస్వామి(విష్ణాలయం) ఆలయ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. నెలాఖరులో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు బుధవారం తెలిపారు. వేణుగోపాలస్వామి ఆలయం శిథిలావస్థకు చేరడంతో దాన్ని తొలగించి 2017 నవంబరు 17న పునర్నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. రూ.12 కోట్ల అంచనాలతో ఒకే ప్రాంగణంలో రామాలయం, ఆంజనేయస్వామి ఆలయం, వేణుగోపాలస్వామి ఆలయాల నిర్మాణ పనులు చేపట్టారు. ఏడు అంతస్తుల ఎత్తైన గాలిగోపురం నిర్మాణాన్ని పూర్తి చేశారు. కరోనా కాలంలో నిర్మాణ పనులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అయినప్పటికీ సర్వాంగ సుందరంగా ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఆలయ ప్రాంగణంలో సుమారు 22 విగ్రహాలను ప్రతిష్ఠ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. శుక్రవారం మహాబలిపురం నుంచి విగ్రహాలు వస్తాయని అధికారులు వెల్లడించారు.

తలసేమియా రోగులకు అండగా ఉందాం



కేన్సర్ ఆస్పత్రి మేనేజర్ జుబేర్, రెడ్‌క్రాస్ ప్రాజెక్ట్‌ల కన్వీనర్లు సుబ్బారెడ్డి, మురళి, రంజని, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(అర్బన్): తలసేమియాతో బాధపడే చిన్నారులకు అండగా ఉందామని రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ కోశాధికారి సురేష్‌కుమార్ జైన్ పేర్కొన్నారు. ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకొని మద్రాస్ బస్టాండ్ సమీపంలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని దాదాపు 200 మంది తలసేమియా రోగులకు రెడ్‌క్రాస్ అండగా ఉంటూ వారికి రక్తాన్ని ఉచితంగా సరఫరా చేస్తోందని చెప్పారు. అనంతరం తలసేమియా రోగులకు సాయం అందించిన డాక్టర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను సత్కరించారు. డాక్టర్ రమ్య, రాజేంద్రప్రసాద్, జిల్లా కార్యదర్శి మస్తానయ్య, సురేష్,

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



నెల్లూరు(పొగతోట): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని డీఎఫ్ఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. వివిధ శాఖలు, స్వయం సహాయక గ్రూపు సభ్యులతో నగరంలోని డీఆర్డీఏ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన శిక్షణ, అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ఏడు అంశాలను పరిగణనలోకి తీసుకొని ప్రజలకు అవగాహన కల్పించాల్సిందిగా లైనింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులకు సూచించారు.

15న దివ్యాంగులకు ఉపకరణాల మంజూరు

పొదలకూరు: సర్వేపల్లి నియోజకవర్గంలోని దివ్యాంగులకు ఉపకరణాల మంజూరుకు వెంకటాచలంలోని కమ్యూనిటీ హాల్‌లో ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నగేష్‌కుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరానికి హాజరయ్యే దివ్యాంగులు 40 శాతానికి పైగా వికలత్వం కలిగి ఉండాలన్నారు. గత మూడేళ్లుగా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉపకరణాలు పొంది ఉండకూడదన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా ఎవరైనా ఉపకరణాలు పొందవచ్చని చెప్పారు. బ్యాటరీ ట్రైసైకిల్ పొందేందుకు ఖచ్చితంగా 80 శాతానికిపైగా వికలత్వం కలిగి ఉండాలన్నారు. 18 నుంచి 50 ఏళ్ల లోపు వారు మాత్రమే అర్హులని తెలిపారు. శిబిరానికి హాజరయ్యే దివ్యాంగులు ఆధార్, రేషన్‌కార్డు, సదరమ్ సర్టిఫికెట్, రెండు ఫొటోలు వెంట తీసుకురావాలని కోరారు.

అసత్య ఆరోపణలు తగవు



మాట్లాడుతున్న గ్రంథాలయ కమిటీ సభ్యులు

కోవూరు(విడవలూరు): విడవలూరు మండలం ఊటుకూరులోని శ్రీరామకృష్ణ గ్రంథాలయం నిర్వహణపై అసత్య ఆరోపణలు తగవని ఆ గ్రంథాలయం పర్యవేక్షణ కమిటీ సభ్యులు గంగాధర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, సుబ్బయ్య పేర్కొన్నారు. బుధవారం గ్రంథాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. స్వాతంత్ర్య సమరయోధులు ఆదిశేషారెడ్డి నిర్మించిన గ్రంథాలయ నిర్వహణ బాధ్యతలను ఆయన కాలం చెల్లిన తర్వాత 1983లో పుచ్చలపల్లి పరంధామిరెడ్డి, ఇందుకూరు రమణారెడ్డి తీసుకున్నారని తెలిపారు. ఈ తరువాత పుచ్చలపల్లి పరరంధామిరెడ్డి మృతి చెందగా, ఇందుకూరు రమణారెడ్డి నెల్లూరు వెళ్లారని చెప్పారు. 2018 నుంచి తాము గ్రంథాలయాన్ని పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. గతంలో వచ్చిన వరదలకు కొన్ని పుస్తకాలు తడిసిపోయాయన్నారు. ఇప్పటికీ గ్రంథాలయంలో ఎన్నో విలువైన పుస్తకాలు పాఠకులకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆదిశేషారెడ్డి ఆశయం కోసమే తాము కమిటీగా ఏర్పడి గ్రంథాలయాన్ని పర్యవేక్షిస్తున్నామే తప్ప, ఇందులో తమ స్వలాభాన్ని చూడలేదన్నారు. కొందరు స్వార్థపరులు వారి ఉనికిని కాపాడుకునేందుకు తమపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా నిజనిజాలు తెలుసుకుని ఫిర్యాదులు చేయడం మానుకోవాలని హితవు పలికారు.

కామాక్షితాయి సేవలో కార్పొరేషన్ కమిషనర్



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారిని నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్ తన కుటుంబసభ్యులతో కలిసి బుధవారం దర్శించుకున్నారు. గణపతి, సుబ్రహ్మణ్య, మల్లికార్జునస్వామి, కామాక్షితాయి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిషనర్‌ను ఆలయ అర్చకులు శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలతో పాటు అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.

ప్రమాదకర మలుపు



పొదలకూరు: పొదలకూరు–రాపూరు మార్గంలో మర్రిపల్లి చెరువు వద్ద రోడ్డు మలుపు ప్రమాదభరితంగా ఉంది. ఇక్కడ తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడం వాహనచోదకులకు దడ పుట్టిస్తోంది. రోడ్డు మలుపు వద్ద ఎటువంటి ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. ఈ కారణంగా వాహనచోదకులు వేగంగా వెళ్లే క్రమంలో అదుపుతప్పి ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొని ప్రమాదాల పాలవుతున్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

నెల్లూరు రూరల్: నరసింహకొండపై నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి రూ.50 వేల విరాళాన్ని హైదరాబాద్‌కు చెందిన శ్రీరక్ష కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. దాతలను ఘనంగా సత్కరించారు. చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ పాల్గొన్నారు.



షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం



నెల్లూరు(క్రైమ్): కారుకు టింకరింగ్ పనులు చేస్తుండగా షార్ట్ సర్క్యూటై అగ్ని ప్రమాదం సంభవించిన ఘటన ఆటోనగర్‌లో బుధవారం చోటుచేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది సమాచారం మేరకు.. నగరానికి చెందిన రోషన్ జమీర్ ఆటోనగర్‌లో టింకరింగ్ షెడ్‌ను నిర్వహిస్తున్నారు. మారుతి జెన్ కారుకు టింకరింగ్ చేస్తుండగా షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. ఉవ్వెత్తున ఎగసిపడిన మంటలు కారుతో పాటు పక్కనే ఉన్న బంకుకు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. ఘటనలో రూ.90 వేల ఆస్తినష్టం వాటిల్లిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు



నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరికి సూపరింటెండెంట్లుగా పదోన్నతి కలిస్తూ కమిషనర్ వికాస్ మర్మత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కార్యాలయంలోని లీగల్ సెల్ విభాగానికి చెందిన ప్రవీణ్, ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగానికి చెందిన చెంచయ్యకు నియామక పత్రాలను కమిషనర్ అందజేశారు. కార్యాలయ మేనేజర్ ఇనాయతుల్లా, పీఆర్వో కృష్ణారావు పాల్గొన్నారు.

క్రీడాకారులకు పౌష్టికాహార పంపిణీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. అసోసియేషన్ కోశాధికారి అనంతరామారావు, విమల వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టారని అధ్యక్షుడు రఘురామ్ ముదిరాజ్ తెలిపారు.

